క్లుప్తంగా

మంత్రి తుమ్మల పరామర్శ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా విద్యాసంస్థల అధినేత, కమ్మ సంఘం నాయకుడు నాయుడు వెంకటేశ్వరరావు తండ్రి సత్యనారాయణ ఆదివారం మృతి చెందారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నగేశ్వరరావు సోమవారం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చల్లగుళ్ల నర్సింహారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, విద్యాసంస్థల అధినేత చలసాని సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు



ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో దాతలు

పెనుబల్లి: వేంసూరు, పెనుబల్లి మండలాల్లో ప్రతిభ చూపిన 15మంది విద్యార్థులకు కోడి హోప్ గ్లోబల్, సోషల్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ, వీజీఎఫ్ ఆధ్వర్యాన సోమవారం ల్యాప్‌టాప్‌లు అందజేశారు. వీ.ఎం. బంజర హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం సీఎంఓ ప్రవీణ్‌కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యూసఫ్, బెల్లంకొండ శ్రీనివాసరావు, నర్సింహారావు, తోటకూర నాగేశ్వరరావు, రాంబాబు, భద్రకాళి ఉన్నారు.

మీనాక్షి నటరాజన్‌ను కలిసిన ఎమ్మెల్యే



మీనాక్షి నటరాజ్‌తో ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కలిశారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగగా మీనాక్షిని కలిసి నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. నాయకులు ఝాన్సీరెడ్డి ఉన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

కొణిజర్ల: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న తమ జీతాలు తక్షణమే విడుదల చేయాలని ఫీల్డు అసిస్టెంట్లు కోరారు. కొణిజర్ల, కూసుమంచి, ఖమ్మం రూరల్, సింగరేణి మండలాల సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. కుటుంబ పోషణ భారంగా మారినందున తక్షణమే జీతాలు విడుదల చేయాలని కోరారు.

అటు పల్లి.. ఇటు పల్లి.. మధ్యలో ఆగమాగం



గుంతలమయంగా ఉన్న కారేపల్లి - పేరుపల్లి రహదారి



వేసిన కొన్నాళ్లకే కుంగిపోయిన బీటీ రోడ్డు

- కారేపల్లి – పేరుపల్లి రహదారిపై ఇక్కట్లు
- ఓవైపు బీటీ పనులు జరుగుతుండగానే ఇంకోపక్క కుంగుబాటు
- పనుల ఆలస్యంపై వాహనదారుల అసహనం

కారేపల్లి: కారేపల్లి – పేరుపల్లి మధ్య బీటీ రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఓ వైపు బీటీ వేస్తుండగానే మరో వైపు పూర్తయిన చోట కుంగిపోతోంది. దీంతో నాణ్యతపై అనుమానాలు వెల్లువెత్తుతుండగా.. మరోపక్క ఆలస్యంతో వాహనాదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కారేపల్లి – మాధారం రోడ్డులో కారేపల్లి నుంచి పేరుపల్లి వరకు ఐదు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి ఎస్‌టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.6కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు గత ఏడాది డిసెంబర్‌లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శంకుస్థాపన చేయగా అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగుతున్నాయి.

కుంగిపోతున్న బీటీ రోడ్డు

ఓ వైపు రహదారి పనులు జరుగుతుండగానే వేసిన చోట బీటీ కుంగిపోతుండడంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కారేపల్లి కుమురం భీం సెంటర్ నుంచి పేరుపల్లి రైల్వే గేటు వరకు రోడ్డంతా మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలతో అందులో నీరు చేరి పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఇక పేరుపల్లి రైల్వే గేటు నుంచి పేరుపల్లి వరకు బీటీ రోడ్డు వేయగా పెద్దచెరువు సమీపాన, తులిస్యాతండా, మున్యాతండా, రావోజీతండా వద్ద కుంగిపోయింది. దీనికితోడు ఇరువైపులా గ్రావెల్ వేయకపోవడంతో రోడ్డు దిగే మార్గం లేక వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఎనిమిది నెలలుగా పనులు

గత ఏడాది డిసెంబర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు మొదలుకాగా ఎనిమిది నెలలైనా పూర్తి కాలేదు. దీంతో నిత్యం కారేపల్లికి వచ్చే తులిస్యాతండా, మున్యాతండా, రావోజీతండా, మల్లన్నగూడెం, పేరుపల్లి, గుంపెళ్లగూడెం, మాధారం, కొత్తతండా, చెన్నంగులగడ్డ, మంగళితండా వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతుకుల మయంగా మారిన బీటీరోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే వంట్లో వణుకు పుడుతోందని చెబుతున్నారు.

పూర్తికాకముందే కుంగిపోయింది



పనులు పూర్తవకముందే బీటీ రోడ్డు కుంగిపోయింది. రోడ్డు వేస్తుండగానే నాణ్యత లేక ఇంకోపక్క పాడైపోయింది. చాలాచోట్ల పగుళ్లు వచ్చి తారు లేచిపోతోంది. అధికారుల పర్యవేక్షణ లేకే ఇలా జరుగుతున్నందున ఇకనైనా దృష్టి సారించాలి.

– సూరబాక నాగేశ్వరరావు, మల్లన్నగూడెం

ఇంకెన్నాళ్లు చేస్తారో?



ఎనిమిది నెలలైనా రోడ్డు పూర్తికాలేదు. వేసిన చోట బీటీ కుంగిపోతుండగా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పక్కగా గ్రావెల్ వేయక వాహనాలు దిగుబడుతున్నాయి. ఇకకైనా సంబంధిత అధికారులు రోడ్డు పనుల్లో వేగం పెరిగేలా చూడాలి.

– వాంకుడోత్ ప్రసాద్, రావోజీతండా

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



ఏన్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రంజిత్‌కుమార్

ముదిగొండ/కారేపల్లి/కొణిజర్ల/ఏన్కూరు/ఎర్రుపాలెం/కల్లూరురూరల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలకు గాను పోలింగ్ స్టేషన్ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాపై సోమవారం ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లు, ఓటర్ల జాబితా ప్రదర్శన తదితర అంశాలపై చర్చించారు. ఓటరు జాబితాపై ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 10లోగా కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఈక్రమాన ముదిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండలపరిషత్ కార్యాలయ సీఎస్ బండి భాస్కర్‌రావు, ఎంపీఓ వాల్మీకి కిషోర్, నాయకులు పాల్గొన్నారు. అలాగే కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు సమావేశం నిర్వహించగా.. మండల పరిషత్ సూపరింటెంట్ రమేష్, నాయకులు కె.నరేందర్, చంద్రప్రకాశ్, రాములు, గౌసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అంతేకాక ఏన్కూరులో ఎంపీడీఓ మాట్లాడగా.. ఎంపీఓ జీవీఎస్ నారాయణ, సూపరింటెండెంట్ తుమ్మలపల్లి కృష్ణ పాల్గొన్నారు. అలాగే కల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బాగం ప్రభాకర్, నరసింహారావు, వెంకటేశ్వరరావు, వీరయ్య, రంగారావు, శ్రీనివాసరావు పాల్గొనగా.. కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయంలోనూ సమావేశం నిర్వహించారు.

సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ బాధ్యులు

సత్తుపల్లిటౌన్: విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఎన్టీఆర్ నగర్ పాఠశాల ఉపాధ్యాయురాలు కె.ఇందిర, వేంసూరు ఉపాధ్యాయుడు ఏ.రాంబాబు, రిటైర్డ్ ఉపాధ్యాయులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన సోమవారం సత్తుపల్లిలో సత్కరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.రవితో పాటు బి.మధుసూదనరాజు, రమణ, డి.కృష్ణయ్య, చల్లగుళ్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు..

మధిర: గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా కృషిచేసిన టీవీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్‌ను సోమవారం ప్రైవేట్ విద్యాసంస్థల బాధ్యులు సన్మానించారు. పాఠశాలల బాధ్యులు బోనగిరి నారాయణరావు, వనజ, మధుసూదన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోస్టుమ్యాన్ రియాజ్‌కు..

కారేపల్లి: కారేపల్లి పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహమ్మద్ రియాజ్ ఇటీవల ఖమ్మం ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఉత్తమ పోస్టుమాన్‌గా ఎంపికయ్యారు. ఇటీవల అవార్డు అందుకున్న ఆయనను పలువురు సన్మానించారు. నాయకులు ఆదెర్ల రాములు, ఆదెర్ల అంజయ్య, కె.రవి, ఉపేందర్, వెంకన్న, టి.కోటేశ్వరరావు, టి.నవీన్, అశోక్ పాల్గొన్నారు.

పరామర్శ

కల్లూరురూరల్: మండలంలోని పలువురి కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం పరామర్శించారు. మండలానికి చెందిన జర్నలిస్ట్ వేము మోహన్‌రావు మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పెద్దకోరుకొండిలో కాంగ్రెస్ నాయకుడు మాదిరాజు అన్నంరాజు తల్లి సరస్వతి దశదినకర్మలో, వాచ్యానాయక్ తండాలో కాంగ్రెస్ నాయకుడు బానోత్ శంకర్ తండ్రి హుస్సేన్‌కు నివాళులర్పించారు. మార్కెట్ చైర్మన్ భాగం నీరజదేవి, ఏనుగు సత్యంబాబు, తక్కెళ్లపల్లి ప్రసాద్, కృష్ణ, ఆళ్లకుంట నర్సింహారావు, ఉస్మాన్, అలీ, శ్రీనివాసరావు ఉన్నారు.

ఈనెల 10న రైతు సదస్సు

కొణిజర్ల/ఏన్కూరు: ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 10న నిర్వహిస్తున్న అఖిలపక్ష రైతు సంఘాల సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లేటి నాగేశ్వరరావు కోరారు. కొణిజర్ల మండలంలోని గుబ్బగుర్తిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పత్తి దిగుబడిపై 11 శాతం సుంకాన్ని రద్దు చేయడంతో రైతులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. సుంకం రద్దు ఉపసంహరణ, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే, ఏన్కూరులో జరిగిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ మాట్లాడగా సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు

సంక్షిప్తంగా..

సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ

సత్తుపల్లిరూరల్: బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాల్లో సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈమేరకు విద్యార్థుల వివరాలను ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ వెల్లడించారు. వీరిని ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఐక్యూ కో–ఆర్డినేటర్ రామచంద్రరావు, అధ్యాపకులు అభినందించారు.

టీబీ వ్యాధిపై అవగాహన

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో సోమవారం టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ప్రత్యూష మాట్లాడుతూ 97 మంది శాంపిల్స్ సేకరించినట్లు చెప్పారు. టీబీ నోడల్ అధికారి కె.పెద్ద పుల్లయ్య, కార్యదర్శి వేణు, సూపర్‌వైజర్ సురేష్, ఆర్.సంజీవ్‌కుమార్, కుమారి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు బానోతు బాలాజీ డిమాండ్ చేశారు. కొన్నిరోజులుగా చేపట్టిన సర్వేలో గుర్తించిన సమస్యలపై తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి డి.నాగేశ్వరావు, నాయకులు ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, రేగళ్ల తిరుమలరావు, రాజ్యలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

అక్షరాస్యతా దినోత్సవ ర్యాలీ

ఏన్కూరు: మండలంలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అక్షరాస్యత ఆవశ్యకతను వివరించారు. హెచ్‌ఎం సాగి సుజాత, ఉపాధ్యాయులు పొట్ట రామారావు, నాగేశ్వరరావు, విజయశ్రీ, శ్రీనివాసరావు, బావుసింగ్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ కోసం పేరెంట్స్ నుంచి రూ.1.50లక్షలు

కల్లూరు: కల్లూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల చుట్టూ తిరుగుతున్న కోతులతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఈమేరకు పిల్లల భయాన్ని తీర్చేలా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని పేరెంట్స్ కమిటీ బాధ్యులు కోరారు. ఇందుకోసం కమిటీ ఆధ్వర్యాన రూ.1.50లక్షలు సమకూర్చగా, మిగతా నిధులు మంజూరు చేయాలని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కొలికపోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాశాలలో 640 మంది విద్యార్థులు ఉండగా విద్యార్థులు, ఉపాధ్యాయులను కారణంగా గాయపరుస్తున్నాయని తెలిపారు. ఈమేరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా

వైరా: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు వ్యవసాయ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి ఏఓ మయాన్ మంజుఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు వరి నాట్లు వేసి రోజులు గడుస్తున్నందున యూరియా సరఫరా చేయాలన్నారు. నాయకులు సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, సాంబశివరావు, రవి, మురళి, రామకృష్ణ, అమరేంద్ర, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ దినోత్సవం

పెనుబల్లి: పెనుబల్లిలో సోమవారం ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దివ్యాంగ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఫిజియోథెరపిస్ట్ మాగంటి ప్రభాకర్, కొండపల్లి మంజుల, తోట ప్రజ్ఞ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

సత్తుపల్లిరూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఎస్‌సీడబ్ల్యూయూ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ కోరారు. సత్తుపల్లిలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం, హామీల అమలు డిమాండ్‌తో ఈనెల 12న చేపడుతున్న ఛలో ప్రజాభవన్‌ను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, నర్సింహారావు, కళావతి, భారతమ్మ, కృష్ణవేణి, పెద్దిరాజు, శ్రీలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

తాపీ వర్కర్ల ఆధ్వర్యాన పాలాభిషేకం

కల్లూరు: కార్మికులకు ప్రమాద బీమాను రూ.6లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచడం, సహజ మరణానికి రూ.1.30 లక్షలు అందే పరిహారాన్ని రూ.2 లక్షలకు పెంచడంపై తాపీ వర్కర్ల యూనియన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కల్లూరులో సీఎం రేవంతడ్డి, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, ఎమ్మెల్యే రాగమయి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎస్‌కే.ఉస్మాన్, తురాబలీ, తాపీ వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు వేల్పుల రవితో పాటు మల్లాది బసవయ్య, షేక్ మహబూబ్ అలీ, రాందాస్, మల్లికార్జున్, ఆశీర్వాదం, ఎస్‌కే.జానీ, ఎం.పిచ్చిరెడ్డి, రాందాసు, బాలస్వామి పాల్గొన్నారు.

పోక్సో కేసులో సీఐ విచారణ

తల్లాడ: మండలంలోని మల్లారంలో పోక్సో కేసుపై వైరా సీఐ ఎన్.సాగర్ సోమవారం విచారణ చేపట్టారు. మైనర్ బాలికపై అత్యాచారం జరగగా, మల్లారం గ్రామానికి చెందిన దుగ్గిదేవర కృష్ణారావుపై ఈనెల 4వ తేదీన కేసు నమోదైంది. ఈమేరకు సీఐ విచారణ చేపట్టగా ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి జైలుశిక్ష

కొణిజర్ల: ఓ మహిళను కులం పేరుతో దూషించిన కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన బచ్చు హుస్సేన్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.9,500 జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జిల్లా న్యాయాధికారి డి.రాంప్రసాద్ సోమవారం తీర్పు చెప్పారు. ఈ తీర్పు వివరాలను వైరా ఏసీపీ ఎం.ఏ.రహమాన్ వెల్లడించారు. హుస్సేన్ ఆటోలో 2019 జనవరి 23న గ్రామానికి చెందిన మహిళ ఖమ్మం నుంచి గుబ్బగుర్తికి వచ్చింది. ఆటోలో సామగ్రి మరిచిపోయానని హుస్సేన్ ఇంటికి వెళ్లి అడగగా కులం పేరుతో దూషించాడని ఆమె కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం హుస్సేన్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ బి.కృష్ణమోహన్ వాదించగా, వైరా ఏసీపీ రహమాన్ విచారణ చేపట్టారు.

ముందస్తు అరెస్టు

సత్తుపల్లి: ఎస్సీ వర్గీకరణలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని పేర్కొంటూ సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ముట్టడికి మాల మహానాడు నాయకులు సిద్ధమయ్యారు. దీంతో ముందస్తుగా పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

వేధింపుల కేసు నమోదు

కల్లూరు: తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన మోదుగు శ్రీనివాసరావుపై వేధింపుల కేసు నమోదైంది. ఆయన కల్లూరు మండలానికి చెందిన ఒంటరి మహిళకు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా, ఆర్థికంగా వాడుకుని తనకేం సంబంధం లేదని బుకాయిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

లారీని ఢీకొట్టిన ట్రాక్టర్

ముదిగొండ: మండలంలోని అమ్మపేట క్రాస్ వద్ద మిల్లు ఎదురుగా ఆగి ఉన్న లారీని సోమవారం ట్రాక్టర్ ఢీకొట్టింది. ఖమ్మం నుంచి కమలాపురం వైపు వెళ్తున్న ట్రాక్టర్ లారీని ఢీకొట్టడంతో ట్రాక్టర్ ఇంజన్ ముందు భాగం విరిగి రెండు చక్రాలు ఊడిపోయాయి. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్ల డ్రైవర్ల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

విద్యుత్ సిబ్బందిపై ఫిర్యాదు

తల్లాడ: మండలంలోని ముద్దునూరులో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ మోటార్ కాలిపోయిందంటూ రైతు ఇమ్మడి హరికృష్ణ సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మిర్చి సాగు కోసం విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసుకోగా శనివారం సిబ్బంది లూజ్ లైన్లు మరమ్మతు చేసే క్రమాన షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మోటార్ కాలిపోయిందని వాపోయాడు.

రోడ్డు నిర్మాణం ఇంకెన్నాళ్లు?



పాదయాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

ముదిగొండ: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ముదిగొండ నుంచి వెంకటగిరి వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారినా కొత్త రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని రహదారి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ఈ రోడ్డును పట్టించుకోకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ముదిగొండ వెంకటగిరి వరకు రహదారి నిర్మించాలనే డిమాండ్‌తో సోమవారం సీపీఎం ఆధ్వర్యాన ముదిగొండ నుంచి ఖమ్మం రూరల్ వెంకటగిరి వరకు 5 కి.మీ. మేర పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు బండి రమేష్, బండి పద్మ, దామోదర్, ఇరుకు నాగేశ్వరరావు, బట్టు రాజు, ఉపేందర్, కల్యాణ్, భద్రయ్య, పద్మావతి, అరుణ, రామయ్య పాల్గొన్నారు. కాగా, పాదయాత్రకు మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ నాయకుడు బంకా మల్లయ్య సంఘీబావం తెలిపారు.

వైరా మార్కెట్ చైర్మన్‌గా బోళ్ల గంగారావు

వైస్ చైర్మన్‌గా కాపా సుధాకర్‌కు అవకాశం



బోళ్ల గంగారావు



కాపా సుధాకర్

వైరా: ఏడాదిన్నర కాలంగా ఎదురుచూస్తున్న వైరా వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ నియామకం ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. మార్కెట్ చైర్మన్‌గా వైరాకు చెందిన బోళ్ల గంగరావు నియామకంపై రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సిఫారసు లేఖ అందజేసినట్లు సమాచారం. రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశముందని తెలిసింది. కాంగ్రెస్‌లో ముప్పై ఏళ్లుగా కొనసాగుతున్న యాదవ సంఘం నాయకుడు బోళ్ల గంగారావు వైరా గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు 2001లో వార్డు సభ్యుడిగా పని చేశారు. అలాగే, ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా, కిసాన్ సెల్ జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేసిన ఆయనను చైర్మన్‌కు ఎమ్మెల్యే సిఫారసు చేశారు. అలాగే, వైస్‌చైర్మన్‌గా తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, డైరెక్టర్లుగా గొడుగునూరి లక్ష్మారెడ్డి, పొట్లపల్లి గోపి, పూనాటి బాబూరావు, బానోత్ మురళీకృష్ణ, రేచర్ల సత్యం, షేక్ మౌలాలీ, కాశిమళ్ల వెంకటేశ్వర్లు, జాలాది తిరుపతిరావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, రేచర్ల మల్లేశ్వరి, ఇనుగుర్తి వెంకటనాగేశ్వరరావు, చావా శ్రీనివాసరావు పేర్లు ఖరారైనట్లు సమాచారం.

కాంగ్రెస్ అంటేనే మోసాలకు కేరాఫ్

జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజు

మధిర: కాంగ్రెస్ పార్టీ మోసాలకు కేరాఫ్‌గా నిలుస్తోందని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పేర్కొన్నారు. మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన యువజన, విద్యార్థి సంఘ నాయకులు, సోషల్ మీడియా వారియర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ యువతకు ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేయడమే కాక నిరుద్యోగ భృతి, యువతులకు స్కూటీల పంపిణీ విషయంలో కాంగ్రెస్ హామీని విస్మరించిందని ఆరోపించారు. ఈ విషయమై గ్రామగ్రామాన వివరించాలని సూచించారు. నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వై.వీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కూనా నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: చింతకాని మండలం చిన్నమండవకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శెట్టపల్లి పాండురంగారావు(72) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహం వద్ద జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్య నివాళులర్పించారు. నాయకులు గురిజాల హనుమంతురావు, మరీదు లక్ష్మీనారాయణ, మంకెన రమేష్, వీరబాబు, పర్సగాని ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత ధరకే ఎరువులు విక్రయించాలి



నాగులవంచలో ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర

చింతకాని: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, ఎవరైనా ధరలు పెంచితే చట్టరీత్యా చర్యలు తప్పవని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర హెచ్చరించిరు. మండలంలోని నాగులవంచ, చింతకాని సొసైటీల్లో ఎరువుల నిల్వలు, రిజిస్టర్లను సోమవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నందున సరిపడా సరఫరా చేయాలని సూచించారు. స్టాక్ బోర్డులు, రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అలాగే, రైతులు కూడా ఆందోళనకు గురికాకుండా అవసరం మేరకే ఎరువులు తీసుకోవాలని, నానో యూరియాతో ప్రయోజనాలను గుర్తించాలని చెప్పారు. ఏఓ మానస, సొసైటీ సీఈఓలు మారగాని శ్రీనివాసరావు, యాలముడి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ నిరసన



తనికెళ్ల గురుకులం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొణిజర్ల: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల టీచింగ్, నాన్ టీచింగ్ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నందున తక్షణమే విడుదల చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకుడు యాకూబ్ పాషా డిమాండ్ చేశారు. వేతనాలు విడుదల చేయాలనే డిమాండ్‌తో సోమవారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యాకూబ్ పాషా మాట్లాడుతూ వచ్చే కొద్దిపాటి జీతాలు కూడా సరైన సమయాన రాక అప్పుల పాలవుతున్నామని తెలిపారు. ఈనెల 15లోగా జీతాలు విడుదల చేయకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించగా.. గురుకులాల ఆర్‌సీఓకు వినతిపత్రం అందజేశారు. సమస్యను సంస్థ సెక్రటరీ షఫీవుల్లా దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్‌సీఓ అరుణకుమారి హామీ ఇచ్చారని తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఎర్రుపాలెం: వివిధ రంగాల కార్మికులకు శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. తొలుత జీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్మిక సంఘం మండల మహాసభలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆరోపించారు. దీనికి తోడు పనికి తగ్గ వేతనం ఇవ్వకపోగా, ఆ వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఇకనానా ప్రతీనెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్ష, కార్యదర్శులు దంతాల నాగేశ్వరావు, కలపాల రవీందర్‌తో పాటు కమిటీని ఎన్నుకున్నారు.

జీపీ కార్యాలయంలో చెత్త వేసి నిరసన



జీపీ ఆవరణలో వేసిన చెత్తాచెదారం

ముదిగొండ: గతంలో ఆదర్శ గ్రామపంచాయతీగా నిలిచిన మేడేపల్లిలో ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడంలేదని ఆగ్రహిస్తూ గ్రామస్తులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈమేరకు పంచాయతీ కార్యాలయ వరండాలో చెత్తాచెదారం వేసి నిరసన తెలిపారు. ఈ సమయాన పంచాయతీ కార్యదర్శి రమ్య దురుసుగా మాట్లాడడంతో గ్రామస్తులు నిలదీయగా ఉద్రిక్తత నెలకొంది. పారిశుద్ధ్య నిర్వహణ, ప్రధాన సమస్యలను చర్చించడానికి గ్రామసభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈక్రమాన పోలీసులు చేరుకోగా, ఎంపీఓ వాల్మీకి కిషోర్ గ్రామస్తులతో ఫోన్‌లో మాట్లాడి బుధవారం గ్రామసభ నిర్వహిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 మధిర ఎస్.కె. సైదులు - 90524 34278
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
రవికుమార్ - 99499 27792
ఎన్. జయరాజు - 96528 68642